సాక్షి పార్వతీపురం మన్యం

ఆదివారం । 31 । ఆగస్టు । 2025

ఇసుక తరలిస్తే ఊరుకోం



రేగిడి మండలం ఖండ్యాం వద్ద నాగావళి నది నుంచి ఇసుక అక్రమంగా తవ్వి రాత్రీ పగలూ తేడా లేకుండా లారీలు, ట్రాక్టర్లతో తరలిస్తున్నారు. దీంతో రోడ్లు, కల్వర్టులు పాడవుతున్నాయి. ఎప్పుడు ఏ ప్రమాదం జరుగుతుందో తెలియడం లేదు... మా గ్రామం మీదుగా ఇసుక తరలిస్తే ఊరుకునేదే లేదంటూ సంతకవిటి మండలం గరికిపాడు గ్రామస్తులు ఆందోళనకు దిగారు. ఆరు ఇసుక లారీలను గ్రామానికి చెందిన యువకులు శనివారం రాత్రి అడ్డుకున్నారు. అధికారులు స్పందించి ఇసుక వ్యాపారానికి అడ్డుకట్టవేయాలని డిమాండ్ చేశారు. - సంతకవిటి



పేరుకే రేషన్ పంపిణీ..! - 8లో

- 8లో

ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తోంది. కందపప్పు సరఫరాను నిలిపివేసి లబ్ధిదారులను ఆవేదనకు గురిచేస్తోంది.

న్యూస్‌రీల్

నిలకడగా నాగావళి నీటి ప్రవాహం



గరుగుబిల్లి: తోటపల్లి ప్రాజెక్టు వద్ద నాగావళి నీటి ప్రవాహం నిలకడగా సాగుతోంది. శనివారం సాయంత్రానికి నది నుంచి 4,775 క్యూసెక్కుల నీరు ప్రాజెక్టులో చేరుతుండగా అధికారులు రెండు గేట్లు ఎత్తివేసి తిరిగి నదిలోకి 5,805 క్యూసెక్కులు నీటిని, కాలువలకు 1220 క్యూసెక్కుల నీటిని విడిచిపెడుతున్నారు. ప్రాజెక్టు నీటి సామర్థ్యం 2.5 టీఎంసీలు కాగా ప్రస్తుతం 1.8 టీఎంసీల వరదనీరు నిల్వ ఉన్నట్లు అధికారులు తెలిపారు.

సులభతర వ్యాపార పద్ధతులపై సర్వే

పార్వతీపురం రూరల్: జిల్లాలో సులభతర వ్యాపార పద్ధతులపై సర్వే చేస్తున్నట్టు కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్ తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో జిల్లాలో పరిశ్రమల పురోగతి, ఎగుమతుల మండలి ఈఓడీబీ అవుట్‌రీచ్ వర్క్‌షాప్ సర్వేపై సంబంధిత అధికారులు, పారిశ్రామిక వేత్తలతో శనివారం సమావేశం నిర్వహించారు. పరిశ్రమల ఏర్పాటుకు మౌలిక సదుపాయాలు, నీటి వసతులు అవసరమని, వాటి లభ్యతను పరిశీలించాలని అధికారులను ఆదేశించారు. నియోజకవర్గాల్లో పారిశ్రామిక పార్క్‌లకు స్థలాలు పరిశీలించాలని ఏపీఐఐసీ జోనల్ మేనేజర్ ఎం.మురళీమోహన్‌కు సూచించారు. పీఎంఈజీపీలో భాగంగా జిల్లాలో కనీసం 75 యూనిట్లను నెలరోజుల్లో ప్రారంభించాలని ఆదేశించారు. సమావేశంలో జిల్లా పరిశ్రమల అధికారి ఎం.వి.కరుణాకర్, జిల్లా కార్మిక శాఖాధికారి సువర్ణ, రాంబాబు, రాజహర్ష, లీడ్ బ్యాంక్ మేనేజర్ విజయ్‌స్వరూప్ పాల్గొన్నారు.

రేపటి నుంచి పోలీస్ అభ్యర్థులకు వైద్య పరీక్షలు

విజయనగరం క్రైమ్: కానిస్టేబుల్ ఉద్యోగాలకు ఎంపికైన అభ్యర్థులకు విజయనగరం పోలీస్ పరేడ్ మైదానంలో సెప్టెంబర్ 1 నుంచి వైద్య పరీక్షలు చేస్తామని ఎస్పీ వకుల్ జిందల్ శనివారం తెలిపారు. ఆ రోజు ఉదయం ఏడు గంటల నుంచి ఐదో తేదీ మినహా ఆరవ తేదీ వరకు ఎంపికైన 723 మంది అభ్యర్థులకు (స్త్రీ, పురుషులు) వైద్య పరీక్షలు నిర్వహిస్తామని చెప్పారు. మెడికల్ టెస్ట్‌కు హాజరయ్యే అభ్యర్థులు వారికి కేటాయించిన రోజు ఒక పాస్‌పోటోను వెంట తీసుకుని రావాలన్నారు. ఏవైనా సందేహాలుంటే సెల్: 94914 72314, 94404 35603 నంబర్లను సంప్రదించాలన్నారు.

నేడు, రేపు ఆదిభట్ల జయంత్యుత్సవాలు

విజయనగరం టౌన్: భాగవతార్ ఆదిభట్ల నారాయణదాసు జయంత్యుత్సవాలు ఈ నెల 31, సెప్టెంబర్ 1వ తేదీల్లో నిర్వహిస్తామని నారాయణదాసు ఆరాధనోత్సవ సంఘం ప్రధాన కార్యదర్శి డాక్టర్ ఎ.గోపాలరావు శనివారం ఓ ప్రకటనలో తెలిపారు. 31న ఆదివారం ఉదయం 9 గంటలకు కానుకుర్తివారి వీధిలో ఉన్న ఆదిభట్ల గృహంలో పూజ, అనంతరం వెన్‌లాక్ పార్కు, సంగీత కళాశాలలో ఉన్న ఆదిభట్ల విగ్రహానికి పుష్పాలంకరణ ఉంటుందన్నారు. వేదిక వద్ద ఉదయం 10.30 నుంచి రెండు రోజుల పాటు పూజ, కథాగానాలు ఉంటాయని తెలిపారు. చివరి రోజు ప్రొద్దుటూరు శ్రీ అన్నమాచార్య కళాపీఠానికి చెందిన యడ్లవల్లి రమణయ్య భాగవతార్‌కి హరికథా చూడామణి బిరుదు ప్రదానం డిప్యూటీ మేయర్ కోలగట్ల శ్రావణి చేతుల మీదుగా ఉంటుందన్నారు. సాహితీవేత్తలు, అభిమానులు హాజరుకావాలని కోరారు.

ఉన్నత విద్యతో ఉజ్వల భవిష్యత్

- ఎస్పీ వకుల్ జిందల్

విజయనగరం క్రైమ్: ఉన్నత విద్యతోనే ఉజ్వల భవిష్యత్ సొంతమవుతుందని, పోలీస్ కుటుంబాల పిల్లలు చక్కగా చదువుకుని ఉన్నత శిఖరాలు అధిరోహించాలని ఎస్పీ వకుల్ జిందల్ అన్నారు. పోలీస్ ఉద్యోగుల సంక్షేమంలో భాగంగా 2023–24 విద్యా సంవత్సరంలో టెన్త్, ఇంటర్, బీటెక్‌లో ప్రతిభ చూపిన 87 మంది విద్యార్థులకు రూ.16,54,000ల మెరిట్ స్కాలర్‌షిప్, మరో 11 మందికి రూ. 6,95,000లను మెరిటోరియస్ స్కాలర్ షిప్ కింద విజయనగరంలోని తన చాంబర్‌లో శనివారం అందజేశారు. ప్రశంసాపత్రాలను అందజేసి ప్రతిభను మెచ్చుకున్నారు. విద్యార్థులు శ్రద్ధ, క్రమశిక్షణతో చదువుకోవాలని సూచించారు. వివిధ కోర్సుల్లో సాధించిన మార్కులు ఆధారంగా రూ.10 వేలు నుంచి రూ.30వేలు వరకు స్కాలర్ షిప్‌ను రాష్ట్ర పోలీస్ కార్యాలయం మంజూరు చేసినట్టు వెల్లడించారు. ఐఐటీ, నీట్, జేఈఈ అడ్వాన్సు పరీక్షల్లో ర్యాంకులు సాధించిన విద్యార్థులకు రూ.25 వేల నుంచి రూ.1.20 లక్షల వరకు మెరిటోరియస్ స్కాలర్‌షిప్ మంజూరు చేసిందన్నారు.

స్త్రీ శక్తి.. బస్సులతో కుస్తీ!

- 'రామభద్రపురంలో పువ్వులు, కూరగాయలు సవగ్గా ఉంటాయి.. ఓసారి అలా వెళ్లి కొనుక్కొని వచ్చేద్దాం..' ఇదీ పార్వతీపురం నుంచి బొబ్బిలి మీదుగా వెళ్లే ఓ బస్సులో నలుగురి మహిళల సంభాషణ.
- 'కండక్టర్ గారూ... డబ్బులిచ్చి, టికెట్ తీసుకొని మేం నిల్చొంటున్నాం.. ఫ్రీగా వెళ్తూ వారేమో చక్కగా కూర్చొంటున్నారు.. టిక్కెట్ తీసుకుని ప్రయాణిస్తున్న మగవారికి సీటు ఇవ్వడం మన బాధ్యతని ఇక్కడ పెద్దగా రాయించేయండి..' ఇదీ బస్సులో ఓ ప్రయాణికుని ఆవేదన.
- ఫ్రీ బస్సులు కాదు గానీ.. గంట నుంచి చూస్తున్నా ఒక బస్సు కూడా ఎక్కలేకపోతున్నాం. మహిళలతోనే నిండిపోతున్నాయి. రోజూ వీరంతా ఎక్కడికి ప్రయాణించేస్తున్నారో!'.. ఇదీ ఓ ఇద్దరు ఉద్యోగుల ఆందోళన.

- పువ్వులు కొనాలన్నా రామభద్రపురానికి..
- ఉచిత బస్సుకు మహిళలు ఫుల్..
  డీలక్స్ సర్వీసులకు నిల్



ఈ చిత్రం చూశారా.. విజయనగరం నుంచి పార్వతీపురానికి శుక్రవారం ఉదయం వెళ్తున్న డీలక్స్ సర్వీసు. విజయనగరంలో పది మంది ప్రయాణికులతో బయల్దేరిన బస్సు.. పార్వతీపురానికి అదే పది మందితో చేరుకుంది. అందులో ఉన్నవారంతా మగవారే. 'చాలా సేపు వేచి చూశానండీ.. ప్రయాణికులు ఎవరూ రావడం లేదు. అప్పటికే ఒక ఎక్స్‌ప్రెస్, ఆల్ట్రా పల్లె వెలుగు, పల్లె వెలుగు బస్సులు వెళ్లిపోయాయి. అందరూ దానికే వెళ్లిపోతున్నారు. సమయం అయిపోవడంతో బస్సు తీయక తప్పలేదు. మధ్యలో కూడా ఎవరూ ఎక్కలేద'ని చెప్పుకొచ్చారు డ్రైవర్.



ఈ చిత్రం కూడా పార్వతీపురం–విశాఖ మార్గంలోనిదే. ఎక్స్‌ప్రెస్ సర్వీసు. బస్సు ఎక్కేందుకు మహిళలు కుస్తీ పడుతున్నారు. సీట్లన్నీ నిండిపోగా.. నిల్చొనే చాలామంది ప్రయాణించారు. దాదాపు పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసులన్నీ కిక్కిరిసిపోతున్నాయి.

సాక్షి, పార్వతీపురం మన్యం :

స్త్రీ శక్తి పథకం కింద ఆగస్టు 15 నుంచి మహిళలకు ఉచిత బస్సు ప్రయాణాన్ని కూటమి ప్రభుత్వం ప్రారంభించింది. మహిళలకు సరిపడా బస్సులు వేయకపోవడం.. కొన్ని సర్వీసులకే పరిమితం చేయడంతో అటు మగవారితోపాటు.. మహిళలకూ ప్రయాణం నరకప్రాయమవుతోంది. ప్రయాణికుల తాకిడి పెరగడంతో సీట్లు దొరకడం కష్టమవుతోంది. ముఖ్యంగా గతంలో ఎన్నడూ లేని విధంగా ప్రయాణం చేస్తున్న మహిళలు అధికమయ్యారు. పల్లె వెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు, ఎక్స్‌ప్రెస్ సర్వీసుల్లో ఉచితంగా ప్రయాణం చేసే అవకాశం కల్పించడంతో ఆయా బస్సులు కిక్కిరిసిపోతున్నాయి. సీట్లు లేక నిల్చోవాల్సిన పరిస్థితి. కొన్ని సందర్భాల్లో ఘర్షణలు



ఎదురుగా వస్తున్న వాహనాలు కనిపించలేనంత వర్షం కురుస్తున్నా.. వైపర్లు సరిగా పని చేయని బస్సులో ప్రయాణం

చోటుచేసుకుంటున్నాయి. కొట్టుకోవడం వరకూ వస్తోంది. తాము టికెట్ తీసుకుంటున్నా.. గంటలకొద్దీ నిల్చొని ప్రయాణం చేయాల్సి వస్తోందని మగవారు వాపోతున్నారు. దీనికితోడు చాలా వరకు పల్లెవెలుగు, ఆల్ట్రా పల్లె వెలుగు బస్సుల్లో అధిక శాతం కాలం చెల్లినవే ఉంటున్నాయి. ప్రయాణికుల తాకిడి పెరగడంతో అవి వేగంగా ముందుకు వెళ్లలేకపోతున్నాయి. దీనికితోడు మహిళలు స్వల్ప దూరం కూడా బస్సులెక్కి వెళ్లిపోతున్నారు. ప్రతి వంద అడుగులకూ ఒక స్టాప్ కచ్చితంగా ఉంటోందని.. దీనివల్ల ప్రయాణం చాలా కష్టమవుతోందని.. సమయానికి గమ్యస్థానం చేరుకోలేకపోతున్నామని మగ ప్రయాణికులు చెబుతున్నారు.

తెగ ప్రయాణించేస్తున్నారు...

గతంతో పోల్చుకుంటే.. ప్రస్తుతం మహిళా ప్రయాణికుల సంఖ్య బాగా పెరిగిందని కండక్టర్లు, డ్రైవర్లు చెబుతున్నారు. జిల్లాలో పార్వతీపురం, పాలకొండ, సాలూరు డిపోల పరిధిలో మొత్తం 238 బస్సులు ఉండగా.. ఇందులో 185 సర్వీసులను ఈ పథకం కింద ఉపయోగిస్తున్నారు. ఈ నెల 15న పథకం ప్రారంభమవ్వగా.. కేవలం వారం రోజుల్లోనే 3,24,236 మంది మహిళలు, విద్యార్థినులు ప్రయాణించడం గమనార్హం. రెండో వారంలో ఈ సంఖ్య మరింత పెరిగిందని ఆర్టీసీ సిబ్బంది అంటున్నారు. ఉద్యోగినులు, విద్యార్థినులతోపాటు.. సాధారణ మహిళా ప్రయాణికుల తాకిడీ బాగా పెరిగిందని చెబుతున్నారు. ఇదే సమయంలో ప్రయాణికులు లేక ఆటో డ్రైవర్లు తీవ్రంగా నష్టపోతున్నారు. ఇప్పటికే పలు మండలాల్లో నిరసనలు వ్యక్తం చేశారు. తమ ఉపాధి పోతోందని ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. ప్రభుత్వం ఆదుకోవాలని కోరుతున్నారు.

ఆల్ట్రా డీలక్స్‌లు ఎక్కేవారేరీ?

ఉచిత ప్రయాణం పుణ్యమానీ.. ఆల్ట్రా డీలక్స్, సూపర్ లగ్జరీ సర్వీసులను వినియోగించుకునే వారి సంఖ్య తగ్గిపోతోంది. ఆల్ట్రా డీలక్స్‌లో విజయనగరం నుంచి పార్వతీపురానికి రూ.145 టికెట్ వసూలు చేస్తున్నారు. ఉచితం కాకపోవడంతో మహిళలు ఈ బస్సులను పూర్తిగా వినియోగించుకోవడం మానేశారు. భార్యాభర్తలో.. మరో కుటుంబం ప్రయాణిస్తున్న సమయంలో ఆడవారికి ఉచితం ఉంటుందన్న కారణంతో అందులో ఉన్న మగవారు కూడా కచ్చితంగా ఎక్స్‌ప్రెస్, పల్లె వెలుగు సర్వీసులనే ఆశ్రయిస్తున్నారు. దీంతో చాలా డీలక్స్ బస్సులు పది, పదిహేను మంది ప్రయాణికులతోనే వెళ్లిపోతున్నాయి. అందులో ఉన్నది కూడా దాదాపు మగవారే కావడం గమనార్హం.

మన్యంలో కిలో అల్లం రూ.40



రైతులు పండించిన అల్లం



సీతంపేట వారపు సంతలో వ్యాపారులు కొనుగోలు చేసిన అల్లం

- సీతంపేట ఏజెన్సీలో భారీగా దిగుబడి
- పట్టణ ప్రాంతాల్లో కిలో రూ.100 వరకు విక్రయం

సీతంపేట:

ఏజెన్సీ ప్రాంత రైతులు సుమారు 100 ఎకరాల కొండపోడులో సాగుచేసిన అల్లంపంట చేతికొచ్చింది. వ్యాపారులు సిండికేట్‌గా మారి పంటను చౌకగా కొనుగోలు చేస్తున్నారు. పట్టణ ప్రాంతాల్లో కిలో రూ.100 నుంచి రూ.150వరకు ధర పలుకుతుండగా, గిరిజనుల నుంచి కిలో రూ.35 నుంచి రూ.40కే కొనుగోలు చేస్తున్నారు. ఒక్కో కిలో వద్ద సగానికి సగం లాభం ఆర్జిస్తున్నారు. సీతంపేట మండలంలోని రంగంవలస, ఎగువ, దిగువ ద్వారబంధం, పుట్టిగాం, తుంబలిగూడ తదితర ప్రాంతాల్లో అల్లం సీజన్ ఆరంభమైంది. అయితే, ధర లేకపోవడంతో గిరిజన రైతులు దిగాలుపడుతున్నారు.

పంట బాగా పండింది



ఈ ఏడాది అల్లం పంట కలిసి వచ్చింది. దిగుబడి బాగుంది. ప్రస్తుతానికి గ్రామాల్లోనే విక్రయిస్తున్నాం. ఆశించిన స్థాయిలో ధర లేకపోవడంతో పంటను తవ్వేందుకు వెనుకంజవేస్తున్నాం.

– ఆనంద్, కలువరాయి, సీతంపేట మండలం

మద్దతు ధర కల్పించాలి



ప్రభుత్వ పరంగా అల్లంతో పాటు అన్ని పంటలకు మద్దతు ధర కల్పించాలి. పైనాపిల్ వంటి పంటల్లో నష్టాలు చవి చూశాం. అల్లం పంటలో మంచి ఆదాయం వస్తుందని ఆశిస్తున్నా నిరాశే ఎదురవుతోంది. వ్యాపారులు సిండికేట్‌గా మారి పంటను దోచుకుంటున్నారు.

– ఎస్.మంగయ్య, ఎంపీటీసీ

నత్తల నివారణకు చర్యలు తీసుకోండి

- కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం రూరల్: నత్తల నివారణకు చర్యలు తీసుకోవాలని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ ఉద్యాన, వ్యవసాయాధికారులను ఆదేశించారు. నత్తల నివారణపై సంబంధిత అధికారులతో వీడియో కాన్ఫరెన్స్‌లో శనివారం మాట్లాడారు. ఉద్యాన, వ్యవసాయాధికారులు అవిశ్రాంతంగా పనిచేసి పంటను కాపాడే మార్గం చూపాలన్నారు. రైతులకు ధైర్యం చెప్పాలని సూచించారు. పంటకు నష్టం కలిగిస్తున్న ఆఫ్రికన్ నత్తలను నిర్మూలించే పద్ధతులపై రైతులకిచ్చే సూచనలు స్పష్టంగా ఉండాలన్నారు. గాలి, వెలుతురు, నేలకు ఎండ తగలకపోవడమే నత్తల విస్తరణకు ప్రధానకారణమన్నారు. ఎప్పటికప్పుడు నత్తలను ఏరి ఉప్పునీటి ద్రావణంలో వేయాలని, మెటాల్డీహైడ్ గుళికలను ఎకరానికి 3 నుంచి 5 కిలోలు వేయాలన్నారు. 25 కిలోల ఊక, మూడు కిలోల బెల్లం, వంద గ్రాముల థియోడీకార్బ్, 100 మీ.లీ ఆముదం నూనె కలిపి చిన్నచిన్న ఉండలు చుట్టి అక్కడక్కడా పంట పొలాల్లో పెడితే వీటిని తిని నత్తలు చనిపోతాయని తెలిపారు.



కాన్ఫరెన్స్‌లో ఉద్యానశాఖాధికారులతో మాట్లాడుతున్న కలెక్టర్ శ్యామ్ ప్రసాద్

వీడియోకాన్ఫరెన్స్‌లో జిల్లా ఉద్యాన శాఖ అధికారి జీఎస్ఎన్ రెడ్డి పాల్గొన్నారు.

ఆదాయ వనరులను సమకూర్చుకోండి

- పంచాయతీరాజ్ శాఖ రాష్ట్ర కమిషనర్ కృష్ణతేజ



డీడీఓ కార్యాలయ నిర్మాణంపై డీడీఓను వివరాలు అడిగితెలుసుకుంటున్న కమిషనర్ కృష్ణతేజ

బొబ్బిలి రూరల్: పంచాయతీల్లోని ఇళ్ల పన్నులు, వాణిజ్య సముదాయాలు, ట్రేడ్ లైసెన్స్‌ల రెన్యువల్, తదితర పద్ధతుల ద్వారా పంచాయతీలకు ఆదాయ వనరులను సమకూర్చుకోవాలని పంచాయతీరాజ్ శాఖ, రూరల్ డెవలప్‌మెంట్ కమిషనర్ ఎం.కృష్ణతేజ సూచించారు. మండలంలోని మెట్టవలస, జగన్నాథపురం గ్రామాల్లో ఆయన శనివారం పర్యటించారు. జగన్నాథపురంలో డీడీఓ కార్యాలయ నిర్మాణాన్ని పరిశీలించి రేకులతో కాకుండా శాశ్వత భవనాన్ని నిర్మించాలని అధికారులను ఆదేశించారు. సచివాలయ సిబ్బందితో మాట్లాడి ఆదాయ వివరాలను తెలుసుకున్నారు. ఆయనకు ఉచిత బస్సు వల్ల ఉపాధికోల్పోయామని ఆటోడ్రైవర్లు, 19 ఏళ్లుగా పనిచేస్తున్నా జీతాలు పెరగలేదంటూ ఫీల్డు అసిస్టెంట్లు వినతిపత్రాలు అందజేశారు. ఆయన వెంట ఎమ్మెల్యేతో పాటు జెడ్పీ సీఈఓ సత్యనారాయణ, డీడీఓ కిరణ్‌కుమార్, ఎంపీడీఓ పి.రవికుమార్, తదితరులు పాల్గొన్నారు.

అంతా సిండికేట్!

- బార్లకు దరఖాస్తులు పడకుండా చక్రం తిప్పిన వ్యాపారులు
- పదింటిలో కేవలం నాలుగుకే లాటరీ
- అందులో రెండు గీత కార్మిక సామాజిక వర్గానికే..
- ఐదు బార్‌లకు పూర్తిగా దరఖాస్తులు నిల్



బార్ల కేటాయింపునకు లాటరీ తీస్తున్న కలెక్టర్ శ్యామ్‌ప్రసాద్



లాటరీ ప్రక్రియకు హాజరైన దరఖాస్తుదారులు, ఎక్సైజ్ అధికారులు

సాక్షి, పార్వతీపురం మన్యం: మద్యం వ్యాపారులు మళ్లీ సిండికేట్ అయ్యారు. ఇటు ప్రభుత్వానికి.. అటు ఎక్సైజ్ అధికారులకు గట్టి షాక్ ఇచ్చారు. నూతన బార్ల పాలసీకి అనుగుణంగా మన్యం జిల్లాలో 10 బార్ అండ్ రెస్టారెంట్లకు ఇటీవల నోటిఫికేషన్ విడుదల చేసిన విషయం విదితమే. ధరావత్తు రుసుం భారీగా ఉండడంతో దానిని తగ్గించి బార్‌లను సొంతం చేసుకునేందుకు సిండికేట్ అయ్యారు. తొలుత ప్రకటించిన దాని కంటే గడువు తేదీని మరో మూడు రోజులు పొడిగించినప్పటికీ.. వ్యాపారులంతా ఒకే మాట మీద ఉండిపోయారు. దరఖాస్తులు వేయకుండా అందరినీ నిలువరించి గట్టి ఝలక్ ఇచ్చారు.

5 బార్లకు 19 దరఖాస్తులు

జిల్లాలో మొత్తం 10 బార్లకు నోటిఫికేషన్ వెలువడగా.. అందులో ఎనిమిది జనరల్, రెండు గీత కార్మిక వర్గానికి కేటాయించారు. గీత కార్మికులకు ఇచ్చిన వాటిలో పార్వతీపురం మున్సిపాలిటీ 1, పాలకొండ 1 చొప్పున ఉన్నాయి. శుక్రవారంతో దరఖాస్తుల స్వీకరణ గడువు పూర్తి కాగా.. శనివారం కలెక్టరేట్‌లో కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ సమక్షంలో లాటరీ ప్రక్రియ నిర్వహించారు. లాటరీ తీయాలంటే ఒక బార్‌కు కనీసం నాలుగు దరఖాస్తుల రావాలన్న నిబంధన ఉంది. ఇదే సిండికేట్‌లకు వరంగా మారింది. కేవలం ఐదు బార్లకే దరఖాస్తులు పడ్డాయి. వీటిలో రెండు గీత కార్మికులకే కేటాయించినవి కావడం గమనార్హం. మరో రెండింటిలో సాలూరు, పార్వతీపురం జనరల్ కేటగిరీవి ఉన్నాయి. సాలూరులో వరుస సంఖ్య 5వ బార్‌కు కేవలం ఒకే ఒక్క దరఖాస్తు రావడంతో నిబంధనల ప్రకారం లాటరీ తీయలేదు. మొత్తంగా పదింటిలో నాలుగే కేటాయించినట్లు అయ్యింది. 50 వేల జనాభా ప్రాతిపదికన పార్వతీపురంలో రూ.50 లక్షలు, సాలూరులో రూ.35 లక్షలు లైసెన్సు ఫీజు చెల్లించాలి. రూ.5 లక్షలు ఫీజు, రూ.10 వేలు ప్రాసెసింగ్ చార్జీల కింద చెల్లించాల్సి ఉంటుంది. రాయితీ కింద గీత కార్మికులకు లైసెన్సు ఫీజులో సగం మొత్తం చెల్లిస్తే సరిపోతుంది. దీంతో వీటికే డిమాండ్ ఏర్పడింది. గతంలో ఉన్న వ్యాపారులు, ప్రస్తుతం మద్యం దుకాణాలు నిర్వహిస్తున్న వారు సిండికేట్‌గా మారి, బినామీ పేరుతో వీటిని దక్కించుకున్నారన్న ఆరోపణలు వినిపిస్తున్నాయి. ప్రస్తుతం మద్యం దుకాణాల్లో అధిక శాతం కూటమి నాయకులవే కావడం విశేషం.

దరఖాస్తులు కరువు

జిల్లాలో ఐదు బార్లకు ఒక్క దరఖాస్తు కూడా పడకపోవడం గమనార్హం. సాలూరులో ఒక దానికి కేవలం ఒక్కటే దరఖాస్తు రావడంతో ఎక్సైజ్ అధికారులు పరిగణనలోకి తీసుకోలేదు. లైసెన్సు ఫీజు 50 వేలు జనాభా దాటి ఉన్న పార్వతీపురం మున్సిపాలిటీ వంటి ప్రాంతంలో రూ.50 లక్షలు చేశారు. ఎవరూ దరఖాస్తు చేయకపోతే ధరావత్తు సొమ్ము తగ్గిస్తారన్న భావనలో అంతా సిండికేట్ అయ్యి.. మూకుమ్మడిగా బాయ్‌కాట్ చేశారని తెలుస్తోంది. ఈ విషయం తెలిసే ఎక్సైజ్ అధికారులు ముందుగానే వ్యాపారులతో సమావేశమయ్యారు. ఒత్తిడి తీసుకురావడంతో కొన్నయినా పడ్డాయని సమాచారం. మొత్తంగా ప్రస్తుతం లాటరీ తీసిన నాలుగు బార్‌లకు సంబంధించి లైసెన్సు ఫీజు రూపంలో ప్రభుత్వానికి రూ.కోటీ 35 లక్షల వరకు సమకూరింది. 19 దరఖాస్తుల నుంచి రూ.96.90 లక్షలు వచ్చాయని జిల్లా మద్య నిషేధ, అబ్కారీశాఖ అధికారి బమ్మిడి శ్రీనాథుడు తెలిపారు.

క్లుప్తంగా

తపాలా శాఖలో జాతీయ స్పోర్ట్స్ డే వేడుకలు



విద్యార్థులకు బహుమతులు అందజేస్తున్న తపాలా శాఖ ఉద్యోగులు

విజయనగరం టౌన్: జాతీయ స్పోర్ట్స్ డే వేడుకలను పురస్కరించుకుని హెడ్ పోస్టాఫీస్ ఆధ్వర్యంలో విద్యార్థులకు ఆటల ఆవశ్యకతను వివరిస్తూ మహారాజా హైస్కూల్‌లో 279 మంది విద్యార్థులతో ప్లెడ్జ్ నిర్వహించారు. ఆటలు, ఆరోగ్యం, ఆవశ్యకత అనే అంశంపై 35 మంది విద్యార్థులకు డిబేట్ నిర్వహించి, విజేతలైన వారికి బహుమతులు అందజేశారు. హెడ్ పోస్టాఫీసులో ఉద్యోగులకు చెస్, కేరమ్స్, టగ్ ఆఫ్ వార్ పోటీలను పోస్టల్ సూపరింటెండెంట్ కె.శ్రీనివాస్ ఆధ్వర్యంలో నిర్వహించారు. స్పోర్ట్స్ కోటా ద్వారా ఉద్యోగం సాధించిన ఉద్యోగులను సత్కరించారు. 31వ తేదీన ఆదివారం హెడ్ పోస్టాఫీస్ నుంచి కోట, మూడు లాంతర్లు, గంటస్తంభం, మీదుగా సైకిల్ ర్యాలీ ఉంటుందన్నారు.

చేపల వేటకు వెళ్లిన వ్యక్తి గల్లంతు



చెరువులో గాలింపు చర్యలు చేపడుతున్న రెస్క్యూ బృందం

పార్వతీపురం రూరల్: మండలంలోని వెలగవలస సమీపంలో బడిదేవరమ్మ చెరువులో శనివారం మధ్యాహ్నం 12 గంటల సమయంలో చేపల వేట నిమిత్తం ఎస్.ములగ గ్రామానికి చెందిన నలుగురు వ్యక్తులు వెళ్లగా మొదట వల విసిరి చెరువులో దిగిన పాడి బంగారిదొర(45) ఈత రాక ప్రమాదవశాత్తు మునిగిపోయాడు. తమకు అందిన సమాచారం మేరకు రెస్క్యూ బృందం ద్వారా చెరువులో గాలింపు చర్యలు చేపట్టినట్టు పార్వతీపురం రూరల్ ఎస్‌ఐ బి.సంతోషికుమారి తెలిపారు. గాలింపు చర్యలు కొనసాగుతున్నాయన్నారు. మరో వైపు జేసీబీ సాయంతో చెరువుకు గండి కొట్టించి నీటిని మళ్లింపు చేస్తున్నట్టు తెలిపారు.

వివాహిత ఆత్మహత్య



ఆసుపత్రిలో లెంక లావణ్య మృతదేహం

నెల్లిమర్ల రూరల్: మండలంలోని జోగిరాజుపేట గ్రామంలో వివాహిత చీమల మందు సేవించి శనివారం ఆత్మహత్యకు పాల్పడింది. ఈ ఘటనపై ఎస్‌ఐ గణేష్, కుటుంబ సభ్యులు తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. గ్రామానికి చెందిన లెంక లావణ్య(25) గత కొంత కాలంగా కడుపు నొప్పి సమస్యతో బాధపడుతుంది. ఎన్ని మందులు వాడినా తగ్గకపోవడంతో మనస్తాపానికి గురై శనివారం ఉదయం ఇంట్లో ఉన్న చీమల మందును నీటిలో కలిపి సేవించింది. గమనించిన కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం నెల్లిమర్ల మిమ్స్ ఆసుపత్రికి తరలించగా చికిత్స పొందుతూ లావణ్య మృతి చెందింది. మృతురాలికి భర్త జనార్ధనరావు, ఇద్దరు కుమారులు ఉన్నారు. మృతురాలి తండ్రి ఆదినారాయణ ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నామని ఎస్‌ఐ గణేష్ తెలిపారు. మృతదేహాన్ని పోస్టుమార్టం నిమిత్తం జిల్లా ప్రభుత్వాసుపత్రికి తరలించారు.

మద్యం బాటిళ్ల పట్టివేత

మెంటాడ : చింతాడవలస గ్రామంలో అక్రమంగా మద్యం అమ్ముతున్నారన్న సమాచారం మేరకు ఎస్‌ఐ కె.సీతారాం తన సిబ్బందితో కలిసి శనివారం దాడి చేశారు. గ్రామంలో ఒక వ్యక్తి తన ఇంట్లో 21 మద్యం బాటిళ్లతో పట్టుబడ్డాడని, ఆ వ్యక్తిపై కేసు నమోదు చేసి కోర్టుకు తరలిస్తామని ఎస్‌ఐ సీతారాం తెలిపారు.

ట్రాక్టర్ డ్రైవర్‌పై కేసు

శృంగవరపుకోట : మండలంలోని స్వప్నలోక్ లేఔట్‌లో ట్రాక్టర్ డ్రైవర్‌గా పని చేస్తున్న బంక రమేష్‌పై కేసు నమోదు చేసినట్టు ఎస్.కోట సీఐ నారాయణమూర్తి చెప్పారు. ఈ నెల 25న లేఔట్లో పని చేస్తున్న సమయంలో ట్రాక్టర్ డ్రైవర్ బంక రమేష్ తన ట్రాక్టర్ వెనకనున్న రొటవేటర్లో రాయి చిక్కుకుంది తీయమని అక్కడే కూలీగా పని చేస్తున్న మునగపాక అప్పారావును కోరాడు. అప్పారావు ట్రాక్టర్ వెనక్కి వెళ్లి రాయి తీసే ప్రయత్నంలో ఉండగా రమేష్ నిర్లక్ష్యంగా ట్రాక్టర్ స్టార్ట్ చేయటంతో అప్పారావు ఎడమ చేయి మండ పూర్తిగా విరిగియింది. క్షతగాత్రుడిని లేఔట్‌లో పనిచేస్తున్న సిబ్బంది విశాఖలోని ఓ ప్రైవేటు ఆసుపత్రిలో జాయిన్ చేశారు. బాధితుని తల్లి ఇచ్చిన ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేశామని సీఐ తెలిపారు.

దరఖాస్తుల ఆహ్వానం

విజయనగరం టౌన్: డాక్టర్ సర్వేపల్లి రాధాకృష్ణన్ జాతీయ స్థాయి ఉపాధ్యాయ రత్న, రాష్ట్ర స్థాయి ఉత్తమ ఉపాధ్యాయ పురస్కారాలు–2025 కోసం అర్హులైన వారి నుంచి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నట్లు ఆల్ ది బెస్ట్ ఆర్ట్స్ అకాడమీ సామాజిక, సాంస్కృతిక సాహిత్య సేవా సంస్థ వ్యవస్థాపకుడు ఇఎస్ఎస్ నారాయణ ఓ ప్రకటనలో శనివారం తెలిపారు. ఉత్తమ విద్యాబోధనతో పాటు క్రీడా, యోగా, సాంస్కృతిక, ఆర్ట్స్ విభాగాల్లో విద్యార్థులను మంచిగా తీర్చిదిద్దుతున్న ప్రభుత్వ, ప్రైవేటు పాఠశాలలు, కళాశాలల ఉపాధ్యాయులు, అధ్యాపకులు దరఖాస్తు చేసుకోవచ్చన్నారు. మరిన్ని వివరాలకు ఫోన్ నంబరు 9652347207ను సంప్రదించాలని కోరారు.

పేరుకే రేషన్ పంపిణీ..!

- పంపిణీలో కనుమరుగైన కందిపప్పు
- ఇచ్చిన కాస్త పంచదారలో నాణ్యత లోపం
- ఇచ్చిన రెండు సరకులకు కిలోమీటర్ల మేర శ్రమభారం
- జిల్లాలో 2,76,873 మంది లబ్ధిదారులు
- రేషన్ దుకాణాలు 477– గిరిజన ప్రాంతాల్లో 101



రేషన్ షాపుల వద్ద నిరీక్షిస్తున్న లబ్ధిదారులు (ఫైల్)

పార్వతీపురం రూరల్: ప్రభుత్వం రేషన్ దుకాణాల ద్వారా కేవలం బియ్యం మాత్రమే పంపిణీ చేస్తూ లబ్ధిదారుల నుంచి ఎప్పటిలాగే అరకేజీ పంచదారకు రూ.17లు తీసుకుంటూ కేవలం ఈ రెండు సరుకులను మాత్రమే తెల్లరేషన్ కార్డు లబ్ధిదారులకు పంపిణీ చేస్తుంది. జిల్లాలో 2,76,873 మంది లబ్ధిదారుల ఉండగా గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వంలో ఎండీయూ వాహనాల ద్వారా గడప దాటకుండా లబ్ధిదారులకు బియ్యం, కందిపప్పు, పంచదారలతో పాటు సీజనల్‌గా గోధుమ పిండి, రాగులను పంపిణీ చేసేది. ప్రస్తుత కూటమి ప్రభుత్వం ఎండీయూ వాహనాల ద్వారా పంపిణీ చేసే వ్యవస్థను రద్దు చేస్తూ జిల్లా వ్యాప్తంగా 578 రేషన్ దుకాణాల ద్వారా రేషన్ పంపిణీ చేస్తుంది. అయితే కేవలం రెండు సరుకుల పంపిణీకే ఈ రేషన్ దుకాణాలు నోచుకుంటున్నాయి. ఈ క్రమంలో పేరుకే ప్రభుత్వ రేషన్ సరుకుల పంపిణీ వ్యవస్థ అన్నట్టు లబ్ధిదారుల నుంచి విమర్శలు వెల్లువెత్తుతున్నాయి. ఈ రెండు సరుకులకే గ్రామీణ ప్రాంతాల్లో, గిరిజన ప్రాంతాల్లో, పట్టణ ప్రాంతాల్లో సైతం లబ్ధిదారులు కిలోమీటర్ల మేర దూరంగా ఉన్న వారికి సంబంధించిన రేషన్ దుకాణాలకు వెళ్లేందుకు అవస్థలు పడుతూ ఆ రోజు వారి పనులు పక్కన పెట్టి ఆటోలకు లేదా బండిలో పెట్రోల్ పోసుకొని లేదా తలపై బరువులు మోస్తూ శ్రమించాల్సి వస్తుంది. ఈ క్రమంలోనే కనీసం కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చాక కందిపప్పుకు కూడా పంపిణీ చేయకపోవడంతో లబ్ధిదారులు కూటమి ప్రభుత్వంపై మరింత అసహనం వ్యక్తం చేస్తున్నారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి దాదాపుగా 14 నెలలు కాలం గడుస్తున్నా పండగలకు ఇస్తామన్న కానుకల పంపిణీ విషయమై కూడా ఊసే లేకుండా వ్యవహరిస్తుంది.

కందిపప్పు కనుమరుగు, పంచదారలో నాణ్యత లోపం

కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన అనంతరం కందిపప్పు రేషన్ ద్వారా పంపిణీని నిలిపివేసింది. ఏ ప్రభుత్వంలోనైనా రేషన్ పంపిణీ ద్వారా నాణ్యత గల సరుకులు మార్కెట్‌లో కన్నా అతి తక్కువ ధరకే అందుతాయన్న ఆశతో లబ్ధిదారులు ఆశిస్తారు. అయితే ఈ ప్రభుత్వంలో ఆ ఆశలన్నీ నిరాశై కేవలం బియ్యం పంపిణీకే పరిమితమయ్యాయి. ఇచ్చిన అరకేజీ పంచదార కూడా నాణ్యత లేకుండా తెల్లగా ఉండాల్సిన పంచదార కాస్త ముదురు గోధుమ రంగులో ఉంటూ దుర్వాసన వస్తూ పంచదార కాస్త చిన్న తడిపదునుతో ఉంటుంది.





భుజాలపై బియ్యం మూటను మోసుకు వెళ్తున్న గిరిజనులు (ఫైల్)



నాణ్యతా లోపంతో గోధుమ రంగులో ఉన్న పంచదార

కిలోమీటర్ల మేర శ్రమభారం

ఎండీయూ వాహనాల ద్వారా రేషన్ సరుకులు పంపిణీ చేస్తూ ప్రజలకు గత ప్రభుత్వం సేవలందిస్తే కూటమి ప్రభుత్వం వచ్చాక ఆ సేవలను కాస్తా కక్షపూరితంగా నిలిపివేసి ప్రజలను అవస్థలకు గురిచేస్తుంది. ఇచ్చిన బియ్యం, పంచదారకు లబ్ధిదారులకు సంబంధించిన రేషన్ షాపులకు వెళ్లేందుకు కిలోమీటర్ల మేర దూరం ఉండడంతో అవస్థలు పడుతూ తిరుగు ప్రయాణంలో తమ నెత్తిపై బాబు ఇలా బరువు భారాన్ని వేశారా అంటూ బియ్యం మూటలను మోసుకుంటూ ఇళ్లకు బయలు దేరుతున్నారు. గిరిజన ప్రాంతాల్లో అయితే మరింత దయనీయ పరిస్థితులు నెలకొన్నాయి. జిల్లా వ్యాప్తంగా ఉన్న గిరిజన ప్రాంతాలకు సమీపంలో ఉన్న 101 రేషన్ షాపుల ద్వారా సరుకులు తీసుకొనేందుకు వచ్చి కిలోమీటర్ల మేర ఇచ్చిన బియ్యాన్నే బ్రతుకు జీవుడా అంటూ అవస్థలు పడుతూ మోసుకువెళ్తున్నారు. పట్టణాల్లో అయితే ఆటో చార్జీలు వెచ్చిస్తున్న లబ్ధిదారులు ప్రభుత్వం ఇచ్చిన రేషన్ సరుకుల కంటే చార్జీలే ఎక్కువ అవుతున్నాయంటూ ప్రభుత్వం తీరుపై అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఇదే క్రమంలో రేషన్ దుకాణాల వద్ద కాస్త క్యూ ఉన్నా లేదా సర్వర్ పని చేయకున్నా నిరాశతో వెనుదిరగాల్సిన పరిస్థితులు, సందర్భాలు ఉన్నాయి.

సమస్యలు ఉంటే పరిష్కరిస్తాం..



రేషన్ షాపుల ద్వారా లబ్ధిదారులకు ఏమైనా సమస్యలు ఉంటే మా దృష్టికి తెస్తే తక్షణమే పరిష్కరించేందుకు చర్యలు తీసుకుంటాం. కందిపప్పు పంపిణీకి సంబంధించి ప్రభుత్వానికి నివేదికలు అందించాం. ప్రభుత్వం నుంచి సరఫరాకు సంబంధించిన అనుమతులు వస్తే కందిపప్పు పంపిణీ జరుగుతుంది. పంచదార ఎక్కడైనా నాణ్యత లేకుంటే మా దృష్టికి వచ్చిన వెంటనే పరిశీలించి నాణ్యత లోపం రుజువైతే పంచదారను మార్చి పంపిణీ చేస్తాం. వచ్చే నెలలో ప్రభుత్వ ఆదేశాల మేరకు మూడో విడతలో రేషన్ స్మార్ట్‌కార్డులు పంపిణీ ఉంటుంది.

– కె.శ్రీనివాస్, జిల్లా పౌర సరఫరాల అధికారి, పార్వతీపురం మన్యం జిల్లా

మొబైల్ రికవరీ మేళాలో 206 సెల్‌ఫోన్ల అప్పగింత

- సెల్‌ఫోన్ పోగొట్టుకుంటే తక్షణమే సీఈఐఆర్ పోర్టల్‌లో ఫిర్యాదు చేయాలి
- ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి





పోగొట్టుకున్న వారికి సెల్‌ఫోన్‌ను అందజేస్తున్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి. (ఇన్‌సెట్లో) రికవరీ చేసిన 206 సెల్‌ఫోన్లు

పార్వతీపురం రూరల్: పోగొట్టుకున్న, దొంగలించబడిన దాదాపు రూ.42లక్షల విలువైన 206 సెల్‌ఫోన్లను బాధితులకు అందజేశామని ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి పేర్కొన్నారు. జిల్లా పోలీసు శాఖ కార్యాలయంలో మొబైల్ రికవరీ మేళా కార్యక్రమాన్ని శనివారం ఏర్పాటు చేసి వివిధ కోణాల్లో సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న బాధితులకు సెల్‌ఫోన్లను అందజేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎవరైనా తమ సెల్‌ఫోన్లు పోగొట్టుకున్న లేదా దొంగలించబడిన తక్షణమే వారు సంబంధిత పోలీసుస్టేషన్లకు వెళ్లి ఫిర్యాదు చేయాలన్నారు. అలా అయితే సీఈఐఆర్ అనే పబ్లిక్ వెబ్‌సైట్‌లో ఆలస్యం లేకుండా లాకింగ్ అభ్యర్థన ద్వారా రిజిస్టర్ చేసుకున్నట్‌లెతై ఆ ఫిర్యాదు ఆధారంగా ఫోను ఐఎంఈఐ నంబరుతో బ్లాక్ చేసిన తరువాత ఆ రిక్వెస్ట్ ద్వారా మొబైల్‌ను ట్రాక్ చేసి సెల్‌ఫోన్ రికవరీ అయిన తరువాత అన్‌లాక్ చేసి పోగొట్టుకున్న వ్యక్తులకు అందజేయడం జరుగుతుందన్నారు. ఈ మేరకు ఈ ఏడాదిలో గత 8 నెలల వ్యవధిలో పోగొట్టుకున్న 206 సెల్‌ఫోన్లను రికవరి చేశామన్నారు. ఇప్పటికే వచ్చిన 1200 ఫిర్యాదులలో గతంలో 500 సెల్‌ఫోన్లు బాధితులకు అప్పగించగా మరో 206 సెల్‌ఫోన్లను పోగొట్టుకున్న వారికి ఇప్పుడు అప్పగించామన్నారు. మేళాలో పార్వతీపురం సబ్ డివిజన్ ఏఎస్పీ అంకితా సురానా, పాలకొండ సబ్ డివిజన్ డీఎస్పీ రాంబాబు, ఏఆర్ డీఎస్పీ థామస్ రెడ్డి, సోషల్ మీడియా, సైబర్ సెల్‌సీఐ శ్రీనివాసరావు, ఎస్‌బీ సీఐ రంగనాథం, సీసీ ఎస్ సీఐ అప్పారావు, డీసీఆర్‌బీ సీఐ ఆదాం, ఏఆర్ ఆర్‌ఐ నాయుడు, సోషల్ మీడియా సెల్ ఎస్‌ఐ రవీంద్రరాజు, ఆర్ఎస్ఐలు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

సారాను అరికడదాం..: కలెక్టర్



సమావేశంలో మాట్లాడుతున్న కలెక్టర్ ఎ.శ్యామ్ ప్రసాద్, ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి

పార్వతీపురం రూరల్: సారాను అరికట్టి కుటుంబాలను కాపాడుదామని కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ పిలుపునిచ్చారు. మత్తు మాదకద్రవ్యాల నియంత్రణపై జిల్లా స్థాయి కమిటీ సమావేశాన్ని శనివారం తన కార్యాలయంలో నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సారాతో యువత కూడా అనారోగ్యం పాలవుతున్నారని, ఈ మేరకు వారిలో పనిచేసే శక్తి తగ్గి ప్రాణాలు కోల్పోయి కుటుంబాలు ఆర్థికంగా చిన్నాభిన్నం అవుతున్నాయన్నారు. ఈ మేరకు మత్తు మాదక ద్రవ్యాల రవాణా, విక్రయం, సరఫరా చేసే వారికి విధిగా శిక్షలు పడేలా కట్టుదిట్టమైన చర్యలు చేపట్టాలన్నారు. అటవీ ప్రాంతం గుండా, బస్సులు ఇతర వాహనాల ద్వారా అక్రమ రవాణాపై పటిష్టమైన నిఘాను ఉంచాలన్నారు. గంజాయి, ఇతర మత్తు పదార్థాల వలన కలిగే చెడు ప్రభావాలపై విద్యా సంస్థల్లో, గ్రామ స్థాయిల్లో విద్యార్థులకు, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. ఈ మేరకు సమావేశంలో పాల్గొన్న ఎస్పీ ఎస్‌వీ మాధవ్‌రెడ్డి పోలీసు శాఖా పరమైన తీసుకున్న చర్యలను వివరించారు. కార్యక్రమంలో ఏఎస్పీ అంకితా సురానా, డీఎస్పీ ఎం.రాంబాబు, జిల్లా రవాణా అధికారి పి.దుర్గాప్రసాద్, జిల్లా డ్రగ్స్ కంట్రోల్ అధికారి ఆశాషేక్ ఇతర అధికారులు తదితరులు పాల్గొన్నారు.

లారీ బోల్తా



బోల్తా పడిన లారీ

గుమ్మలక్ష్మీపురం: విశాఖపట్నం నుంచి పశ్చిమ బెంగాల్‌కు హైడ్రో క్లోరైడ్ ఆమ్లం(రసాయం)తో ఒడిశా వైపు నుంచి వెళ్లేందుకు వస్తున్న లారీ శనివారం గుమ్మలక్ష్మీపురం మండలం పి ఆమిటి జంక్షన్ సమీంలోని ప్రధాన రహదారి పక్కనే అదుపు తప్పి బోల్తా పడింది. అయితే ట్యాంకు నుంచి ఆ రసాయనం లీక్ కాకపోవడంతో ఎటువంటి నష్టం జరగలేదు. ఈ ప్రమాదంలో కొద్దిపాటి గాయాలతో డ్రైవర్, క్లీనర్ బయటపడ్డారు. సమాచారం తెలుసుకున్న ఎల్విన్‌పేట ఎస్‌ఐ బి.శివప్రసాద్ సంఘటనా స్థలానికి చేరుకొన్నారు. బోల్తా పడిన లారీలో రసాయనం ఉండడంతో ఎటువంటి ప్రమాదం జరగకుండా వాహనదారులు స్థానికులు జాగ్రత్తలు తీసుకున్నారు.

గల్లంతైన గిరిజన మత్స్యకారుడి మృతదేహం లభ్యం



వెలికితీసిన గిరిజన మత్స్యకారుడు బాలరాజు మృతదేహం

పాచిపెంట : మండలంలోని కోడికాళ్లవలస గ్రామానికి చెందిన గిరిజన మత్స్యకారుడు జన్ని బాలరాజు(37) చేపల వేటకు వెళ్లి ఈ నెల 27వ తేదీన గల్లంతైన విషయం పాఠకులకు తెలిసిందే. అయితే స్థానిక ఎస్‌ఐ వెంకట్ సురేష్ నేతత్వంలో నాలుగు రోజులుగా గజ ఈతగాళ్లు, ఎస్‌డీఆర్ఎఫ్ సిబ్బంది గాలింపు చర్యలు చేపట్టగా, శనివారం ఉదయం 8 గంటల సమయంలో బాలరాజు మృతదేహం లభ్యమైంది. మృతదేహానికి శవపంచనామా నిర్వహించి, పోస్టుమార్టం నిమిత్తం సాలూరు ఏరియా ఆసుపత్రికి తరలించారు. అనంతరం మృతదేహాన్ని కుటుంబ సభ్యులకు అప్పగించినట్లు ఎస్‌ఐ పేర్కొన్నారు.



తన పిల్లలతో కన్నీరు మున్నీరుగా విలపిస్తున్న మృతుడు భార్య బుజ్జి

క్షేమంగా ఉండి ఉంటాడని ఆశ పడ్డాను..

గల్లంతై మూడు రోజులుగా భర్త ఆచూకీ లభ్యం కాకపోవడంతో ఎక్కడో ఒకచోట తన భర్త క్షేమంగా ఉండి ఉంటాడనే చిన్న ఆశతో ఉండే భార్య బుజ్జి భర్త మృతదేహాన్ని చూసి కన్నీరు మున్నీరుగా విలపించింది. ఈ సంఘటన స్థానికంగా కలచివేసింది.

పిడుగు పాటుకు మహిళా రైతు మృతి



మృతి చెందిన మహిళా రైతు ఈశ్వరమ్మ

లక్కవరపుకోట : మండలంలోని గేదులవానిపాలెం పంచాయతీ శివారు వేచలపువానిపాలెం గ్రామానికి చెందిన మహిళా రైతు నెక్కల ఈశ్వరమ్మ(36) పిడుగు పాటుకు గురై శనివారం మృతి చెందింది. దీనికి సంబంధించి గ్రామస్తులు తెలిపిన వివరాలు.. మృతురాలు ఈశ్వరమ్మ గ్రామానికి సమీపంలో గల పంట పొలంలో వరి గాబు తీత పనులో ఉండగా మధ్యాహ్నం ఉరుములు, మెరుపులతో వర్షం ప్రారంభమైంది. ఈ క్రమంలో పడిన పిడుగుకు ఈశ్వరమ్మ పొలంలోనే పడిపోవడంతో సమీపంలో వ్యవసాయ పనులు నిర్వహిస్తున్న రైతులు గుర్తించి వెంటనే ఎస్.కోట సీహెచ్‌సీకి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందింది. కాగా మృతురాలికి భర్త, ఇద్దరు ఆడపిల్లలు ఉన్నారు. ఈశ్వరమ్మ మృతితో కుటుండ సభ్యులు కన్నీరు మున్నీరుగా విలపించారు.

యువకుడిని కత్తితో పొడిచిన వ్యక్తి అరెస్ట్



విలేకరులకు వివరాలు వెల్లడిస్తున్న సీఐ రామకృష్ణ

మక్కువ: మండలంలోని దేవరశిర్లాం పంచాయతీ లోవరఖండి గ్రామానికి చెందిన ఓ యువకుడిని కత్తితో పొడిచిన వ్యక్తిని శనివారం పోలీసులు అరెస్ట్ చేసి రిమాండ్‌కు తరలించారు. స్థానిక పోలీస్‌స్టేషన్‌లో సాలూరు రూరల్ సీఐ పి.రామకృష్ణ విలేకరులతో శనివారం మాట్లాడుతూ వివరాలు వెల్లడించారు. లోవరఖండి గ్రామానికి చెందిన సాగరపు దమయంతి మేనళ్లులు మహేశ్, కిశోర్ వినాయక చవితి పండగకు జగన్నాథపురం గ్రామం నుంచి లోవరఖండి చేరుకున్నారు. సాయంత్రం లోవరఖండిలో వాలీబాల్ ఆటను మహేశ్, కిశోర్‌లు ఆడుతుండగా, అదే గ్రామానికి చెందిన సాగరపు శివందొర అలియాస్ ఆదినారాయణ బెట్టింగ్ కట్టి నాతో వాలీబాల్ ఆడాలంటూ, మహేశ్, కిశోర్‌ల వైపు చక్కరగుత్తి (ధాన్యం నాణ్యత చూసే పరికరం) చూపిస్తూ బెదిరించాడు. దీంతో వీరి మధ్య చిన్నపాటి వివాదం చోటుచేసుకుంది. ఈ ఘటనలో శివందొరకు చిన్నపాటి గాయాలయ్యాయి. అంతేకాకుండా అప్పటికే రెండు కుటుంబాల మధ్య వివాదం చోటుచేసుకుంది. సాగరపు దమయంతికి ఐదు ఆవులు ఉన్నాయి. శివందొర గ్రామంలో మొక్కలు పెంచుతున్నాడు. దమయంతికి చెందిన ఆవులు మొక్కలను ముున్ముందు తినేస్తాయంటూ, దానివలన నష్టం జరిగే అవకాశముందని శివందొర ముందుగానే ఊహించుకొని, దమయంతి కుటంబంతో గొడవపడ్డాడు. తనను, నా భార్య హేమలతను తరుచూ ఎందుకు తిడుతున్నారంటూ, ఇంటిలో ఉన్న చక్కరగుత్తి పట్టుకొని, దమయంతి పైకి శివందొర వెళ్లాడు. ఇంటి మేడపై పిల్లలతో ఆడుకుంటున్న కార్తీక్ కిందకు దిగి అడ్డుకోబోతుండగా కత్తిపోటుకు గురై మృతి చెందినట్టు సీఐ తెలిపారు. నిందితుడు శివందొరను అరెస్ట్ చేసి, రిమాండ్‌కు తరలించినట్టు సీఐ తెలిపారు. సీఐ వెంట ఎస్‌ఐ మామిడి వెంకటరమణ ఉన్నారు.

విజయనగర కీర్తిని పెంచేలా పైడితల్లి పండగ

- మంత్రి కొండపల్లి శ్రీనివాస్



సిరిమాను జాతర ఉత్సవాల పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న మంత్రి కొండపల్లి శ్రీనివాస్ తదితరులు

విజయనగరం టౌన్: శ్రీపైడితల్లి అమ్మవారి జాతర మహోత్సవాలు విజయనగరం కీర్తిని పెంచేలా నిర్వహించాలని రాష్ట్ర ఎంఎస్‌ఎంఈ, సెర్ప్ శాఖల మంత్రి కొండపల్లి శ్రీనివాస్ పేర్కొన్నారు. అక్టోబరు 6, 7 తేదీల్లో నిర్వహించే ఉత్సవం ఆహ్లాదకర వాతావరణంలో చేసుకోవాలని, గతేడాది కంటే గొప్పగా నిర్వహించాలన్నారు. కలెక్టరేట్ సమావేశ మందిరంలో కలెక్టర్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్‌తో కలిసి పైడితల్లి అమ్మవారి జాతర ఉత్సవాలపై శనివారం సమీక్షా సమావేశం నిర్వహించారు. ఉత్సవాలకు వారం రోజుల ముందు నుంచే నగరమంతా విద్యుత్ కాంతులతో అలంకరించాలని, తాగునీటి సరఫరా, పారిశుధ్యం, నిరంతరం విద్యుత్ సరఫరా ఉండేలా చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులకు ఆదేశించారు. సిరిమాను ఊరేగింపు 3 గంటలకే మొదలు పెట్టాలని, ఐదు గంటలకు ముగించేయాలన్నారు. కలెక్టర్ డాక్టర్ బిఆర్.అంబేద్కర్ మాట్లాడుతూ శాఖల వారీగా ఎవరెవరు ఏఏ పనులు చేయాలో ఆదేశించారు. సాధారణ దర్శనాలకు ఇబ్బంది కలగకుండా విఐపీ దర్శనాలను ఏర్పాటు చేయాలని దేవాలయ అధికారులకు ఆదేశించారు. కంట్రోల్ రూం, మెడికల్ క్యాంప్, 108 వాహనం కూడా ఏర్పాటు చేయాలన్నారు. మూడు రోజుల ముందు నుంచే పారిశుధ్య కార్యక్రమాలను నిర్వహించాలని, తాగునీటి సరఫరా చేయాలని, ఆయా అధికారులకు సూచించారు. రథం ఫిట్‌నెస్‌ను అటవీశాఖ అధికారులు తనిఖీ చేయాలని, ఆర్‌డీవో అటవీ అధికారులు సమన్వయంతో పని చేయాలన్నారు. తెప్పోత్సవం దగ్గర గజ ఈతగాళ్లను ఏర్పాటు చేయాలని మత్స్యశాఖ అధికారులకు ఆదేశించారు. విజయనగరం ఉత్సవాలపై సంయుక్త కలెక్టర్ ఆధ్వర్యంలో జిల్లా స్థాయి కమిటీని వేసి ఉత్సవాలను ఏ విధంగా నిర్వహించాలో తదుపరి నిర్ణయించడం జరుగుతుందని కలెక్టర్ తెలిపారు. ఉత్సవాల కోసం ప్రభుత్వం రూ.50 లక్షలు కేటాయించిందని, నిధుల విడుదల కోసం డీవో లేఖ రాయడం జరిగిందన్నారు. విజయనగరం ఎమ్మెల్యే అదితి విజయలక్ష్మి మాట్లాడుతూ సమన్వయంతో పనిచేసి పండగను విజయవంతం చేయాలని తెలిపారు. ఎస్పీ వకుల్ జిందల్ మాట్లాడుతూ అమ్మవారి ఉత్సవాల కోసం రెండువేల మంది పోలీసులను నియమిస్తామన్నారు. అనంతరం పైడితల్లి అమ్మవారి సిరిమాను ఉత్సవాలకు సంబంధించిన పోస్టర్‌లను ఆవిష్కరించారు. సమావేశంలో జేసీ సేతుమాధవన్, డీఆర్‌వో శ్రీనివాసమూర్తి, డీసీఎంఎస్ చైర్మన్ గొంప కృష్ణ, దేవదాయశాఖ అసిస్టెంట్ కమిషనర్ కె.శిరీషా, సిరిమాను పూజారి బంటుపల్లి వెంకటరావు, జిల్లా అధికారులు పాల్గొన్నారు.

చికెన్

బ్రాయిలర్		
లైవ్	డ్రెస్డ్	స్కిన్‌లెస్
₹133	₹236	₹246

ఈవీఎం గోదాములను తనిఖీ చేసిన కలెక్టర్



ఈవీఎం గోదామును తనిఖీ చేసిన కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్

పార్వతీపురం టౌన్:

పట్టణ పరిధిలోని వ్యవసాయ మార్కెట్ యార్డు వద్ద గల ఈవీఎం గోదామును కలెక్టర్ ఎ.శ్యామ్‌ప్రసాద్ తనిఖీ చేశారు. నెలవారీ తనిఖీల్లో భాగంగా శనివారం ఆయన గోదాములను సందర్శించి అక్కడ పరిస్థితిని గమనించారు. గోదాములకు వేసిన సీళ్లను, ఈవీఎంల రక్షణ, భద్రతకు సంబంధించిన ఏర్పాట్లను పరిశీలించారు. ఈ మేరకు పర్యవేక్షణ రిజిస్టర్‌లో ఆయన సంతకం చేసి గోదాముల వద్ద విధులు నిర్వహిస్తున్న పోలీసు సిబ్బందికి అప్రమత్తంగా ఉండాలని ఆదేశించా రు. ఏర్పాట్లను పరిశీలించి అధికారులకు పలు సూచనలు, మార్గదర్శకాలు జారీ చేశారు. ఈ తనిఖీల్లో జిల్లా రెవెన్యూ అధికారి కె.హేమలత, స్థానిక తహసీల్దార్ సురేష్ తదితరులు న్నారు.